

ఇసుక తరలింపునకు బ్రేక్

అనుమతి లేకుండా భారీగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను స్థానికులు అడ్డుకుని, పోలీసులు అప్పగించారు. - IIలో



అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రాజేంద్ర తెలిపారు. - IIలో



30 ఏళ్ల సమస్యకు పరిష్కారం

దాదాపు 30 ఏళ్లుగా అంధకారంలో ఉన్న గ్రామానికి మంత్రి రోజా ప్రత్యేక చొరవతో విద్యుత్ సదుపాయం కల్పించారు. - IIలో

న్యూస్‌రీల్

జెడ్పీ చైర్మన్‌కు కీలక పదవి



శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు గెజిట్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ కింద వచ్చే ప్రాజెక్టులను పరిశీలించి అనుమతుల కోసం సంబంధిత సంస్థకు సిఫార్సు చేయడం ఈ అథారిటీ ప్రధాన విధి. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు ఉంటారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వద్దు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: స్పందన ద్వారా వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా చూడాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం తగదని ఎస్పీ రిశాంత్‌రెడ్డి హెచ్చరించారు. చిత్తూరులోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మీతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. కుటుంబ, ఆస్తి తగాదాలు, భూ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, పోలీసు సేవలపై ప్రజలు ఏఎస్పీకి వినతులు ఇచ్చారు. వాటిని నిర్ణీత సమయంలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

స్వామిత్వ సర్వేకు సహకరించండి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో కొనసాగుతున్న స్వామిత్వ సర్వేకు ప్రజలు సహకరించాలని డీపీఓ లక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 822 గ్రామాల్లో డ్రోన్ ద్వారా సర్వే ప్రారంభించామన్నారు. అందులో 35 గ్రామాల్లో ప్రక్రియ పూర్తవ్వగా 17 గ్రామాలకు సంబంధించిన హక్కు పత్రాలు వచ్చాయన్నారు. వీటిని త్వరలో ప్రజలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ పత్రాలతో ఆస్తి అమ్మక, బదలాయింపు, తనఖా వంటివి చేసుకోవచ్చన్నారు. సర్వే బృందం పల్లెలకు వచ్చినప్పుడు ఆస్తి పత్రాల నకళ్లను వారికి చూపించి సర్వేకు సహకారం అందించాలని కోరారు.

డిసెంబర్ 9 వరకు నమోదు



డీఆర్‌వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఓటు హక్కు కోసం నమోదు చేసుకునేందుకు డిసెంబర్ 9 వరకు అవకాశం ఉన్నట్లు డీఆర్‌వో రాజశేఖర్ వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరులతో వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18ఏళ్ల నిండిన వారు ఓటు హక్కుకు నమోదు చేసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 4, 5 తేదీల్లో కొత్త ఓటర్ల నమోదుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు క్యాంపులు నిర్వహించామన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన క్యాంపుల్లో ఫారం 6, 7, 8 లు 21,090 అందినట్లు తెలిపారు. ఈ నెల 4వ తేదీన 8760, 5వ తేదీన 12,330 దరఖాస్తులు అందాయని వెల్లడించారు. ఫారం 6 (కొత్త ఓటర్లు) దరఖాస్తులు 9266, ఫారం 7 (ఓటరు జాబితాలో పేర్ల తొలగింపుకు) దరఖాస్తులు 7000, ఫారం 8 (తప్పులను సరిచేసుకునేందుకు) దరఖాస్తులు 4824 మొత్తం 21,090 దరఖాస్తులు అందినట్లు డీఆర్‌వో వెల్లడించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ముఖ్యమంత్రి, ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

చౌడేపల్లె: రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి స్వీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని పలువురు జర్నలిస్టులు కొనియాడారు. స్థానిక బస్టాండులో సోమవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల చిత్ర పటాలకు జర్నలిస్టులు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించడం అభినందనీయమని జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టులు మహేష్‌బాబు, నాగరాజ, శంకరయ్య, రసూల్, రామారావు, మురళి, మణిసింగ్, భవానీ సింగ్, రమేష్ బాబు తదితరులున్నారు.

అతిసారం
అప్రమత్తత అవసరం



డయేరియా.. సమస్య చిన్నదే. తేలికగానే అదీ చికిత్స తీసుకోకపోయినా తగ్గిపోతుంది. కొన్నిసార్లు ఇంటి చిట్కాలే సరిపోవచ్చు. అలాగని నిర్లక్ష్యం చేయలేం. తీవ్రమైతే ప్రాణాల మీదకు తెస్తుంది. అంతా తేలికగా తీసుకునే ఈ వాంతులు, విరేచనాల వ్యాధి కొన్నిసార్లు ప్రాణాపాయానికి దారితీయచ్చు. చిన్నారులు, వృద్ధులకైతే ఇది ప్రమాదకరమే. ప్రధానంగా ఆహారం, నీరు కలుషితం కావడం వల్ల సంభవించే డయేరియాపై అప్రమత్తత అవసమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- కలుషిత ఆహారంతో అతిసారం
- నిర్లక్ష్యం చేస్తున్న బాధితులు
- ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న వైనం
- జాగ్రత్తలు అవసరమంటున్న నిపుణులు

- గుడిపాల మండలం చిత్తపార గ్రామంలో గత నెల 18వ తేదీన ఓ విందు నిర్వహించారు. ఈ విందు భోజనం తిన్నవారిలో 37మంది అతిసారం బారిన పడ్డారు. మరుసటి రోజు ఆ గ్రామం నుంచి 17 మంది చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. రుయాకు ఆరుగురు, మిగిలిన వాళ్లు సీఎంసీని ఆశ్రయించారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గ్రామంలో వైద్య శిబి రం ఏర్పాటు చేశారు. విందులో పాల్గొన్న వారందరికీ వైద్య సేవలు అందించారు. ఈ గ్రామంలో ఎలాంటి ప్రాణహాని జరగలేదు.
- చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో శనివారం అతిసారం విజృంభించింది. ఈ వ్యాధి బారిన పడిన మల్లిక (55) మృతి చెందింది. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటా సర్వే చేపట్టారు. తొలి రోజు 15 మందిని గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నారు. కొత్తగా మరో నాలుగు కేసులు వచ్చాయి. వారిని శిబిరంలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. అయితే గ్రామంలో కలుషిత నీటి కారణంగా అతిసార విజృంభించిందని అధికారులు నిర్ధారించారు.



చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో బాధితులకు వైద్యం అందిస్తున్న దృశ్యం

జిల్లాలో డయేరియా ఓపీ వివరాలు

నెల		ఓపీ సంఖ్య
జూలై	:	7,685
ఆగస్టు	:	7,887
సెప్టెంబర్	:	7,430
అక్టోబర్	:	7,179

జిల్లాలోని ఆస్పత్రుల వివరాలు...

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి	:	1
ఏరియా ఆస్పత్రి	:	4
సీహెచ్‌సీ	:	7
పీహెచ్‌సీ	:	50
అర్బన్ హెల్త్ సెంటర్	:	14
ప్రైవేటు ఆస్పత్రులు	:	2000

లక్షణాలు

రోజుకు మూడు, అంతకన్నా ఎక్కువ సార్లు వాంతులు, విరేచనాలు కావడాన్ని అతిసారంగా భావిస్తారు. రెండు వారాల వరకు వేధిస్తుంటే ఆకస్మిక సమస్యగా, అంతకన్నా ఎక్కువకాలం కొనసాగితే దీర్ఘకాలిక సమస్యగా పరిగణిస్తారు. దీనికి రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి. ఫుడ్ అలర్జీ, తాగునీరు, వైరస్, బ్యాక్టీరియా, కొన్ని రకాల మందుల వల్ల విరేచనాలు అవుతుంటాయని వైద్యులు చెబుతున్నారు.

- కడుపులో నొప్పి
- అతిగా నీటి దాహం
- నీరసించి పోవడం
- డీ హైడ్రేషన్
- పొత్తికడుపులో నొప్పి
- తేలికపాటి జ్వరం
- నిద్రలేమి
- ఒంటికి శక్తినిచ్చే ఖనిజ లవణాలు, గ్లూకోజు తగ్గిపోవడం
- తలనొప్పి, తికమక పడడం
- కండరాలు బహీనపడతాయి

చిత్తూరు రూరల్: జిల్లాలో కలుషిత ఆహారం, నీరు స్వీకరించి ఆస్పత్రుల పాలవుతున్న బాధితుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి నెలా 7వేలకు పైగా ఓపీలొస్తున్నాయి. డయేరియా (నీళ్ల విరేచనాలు,) గ్యాస్ట్రో ఎంటరైటిస్ (వాంతులు, విరేచనాలు) కామెర్లు, టైఫాయిడ్, జిగట విరేచనాలు తదితర వ్యాధులు విజృంభిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొందరు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. మరికొందరు నాటువైద్యం, సొంత వైద్యం చేయించుకుంటున్నారు. ఇంకొందరు మాత్రం ఆర్‌ఎంపీ వైద్యులను సంప్రదిస్తున్నారు. తగిన చికిత్స అందకపోగా అతిసారం అతిగామారి కొన్ని సందర్భాల్లో ప్రాణం మీదకు తెస్తోంది. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణం స్పందిస్తున్నారు. గ్రామంలోనే శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

మెరుగైన వైద్యం

అతిసారం కేసులు అధికంగా వేసవిలో మాత్రమే నమోదవుతుంటాయి. నగరం, పల్లె తేడా లేకుండా తాగునీరు కలుషితం కావడంవల్ల కొందరు విరేచనాలతో ఆస్పత్రులు పాలవుతుంటారు. విరేచనాలు ప్రారంభమయ్యే రోజు నుంచే ప్రభుత్వ వైద్యులను సంప్రదించి తగిన వైద్యం చేయించుకుంటే మంచిదని చెబుతున్నారు. ఇక ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల మందులు, మాత్రలు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. బాధితులను ఆస్పత్రిలో చేర్చుకుని, తగిన వైద్యం అందిస్తూ, నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారం రోజుల పాటు బాధితులను పర్యవేక్షిస్తున్నారు. అతిసార కేసులు పూర్తిగా నయమయ్యే వరకు తగిన వైద్యం అందిస్తున్నారు. మూఢనమ్మకాల జోలికి వెళ్లకూడదని వైద్యులు చెబుతున్నారు.

నివారణ ఇలా..

వాంతులు, విరేచనాలు ఉంటే చికిత్స కంటే ముందు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- ✔ మల, మూత్ర విసర్జన తరువాత, చేతులు శుభ్రపరుచుకోవాలి.
- ✔ కాచి చల్లార్చిన నీళ్లు తాగాలి.
- ✔ వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలి.
- ✔ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- ✔ ఫ్లూయిడ్స్ తీసుకోవాలి.
- ✔ ఓఆర్ఎస్ తీసుకోవడం చాలా మంచిది.
- ✔ తాజాగా వండిన ఆహారం తినాలి.

ప్రభుత్వం తక్షణం స్పందిస్తోంది



“ పెద్ద మొత్తంలో విరేచనాలవుతూ డీహైడ్రేషన్ లక్షణాలు కనిపిస్తాయి. ఇతర లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ఆరోగ్య సూత్రాలు పాటించాలి. వెంటనే డాక్టరును సంప్రదించాలి. యాంటీ బయాటిక్స్ వాడిన తర్వాత విరేచనాలు వేధిస్తున్నా, డాక్టర్లను కలవాలి. పదికిపైగా కేసులు నమోదైతే ఆప్రాంతంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. అన్ని రకాలుగా ఉచితంగా వైద్యం చేయిస్తున్నాం.

– రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్

జాగ్రత్తలు అవసరం



కలుషిత ఆహారం, అపరిశుభ్ర నీటితో డయేరియా వస్తుంది. పెద్దలతో పోలిస్తే పిల్లల్లోనే ఎక్కువగా వ్యాపిస్తుంది. వైరస్ కడుపులోకి చేరిన మూడు రోజుల తర్వాత ప్రభావం చూపుతుంది. ఒంట్లోని నీరు, లవణాల శాతం తగ్గినప్పుడు నీరసంతో స్పృహ తప్పి పడిపోతుంటారు. ఇలాంటప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి. చికిత్స చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికి కూడా ప్రమాదమే.

– రవిరాజు, డీఐఓ, చిత్తూరు

నేతన్నకు సర్కారు చేయూత

- చంద్రబాబు పాలనలో కుదేలైన నేత పరిశ్రమ
- జగనన్న సారథ్యంలోనే మేలు
- గడప గడపకూ మన ప్రభుత్వంలో మంత్రి ఆర్‌కే రోజా



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా నేటి జగనన్న ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో నేతన్నల కోసం వివిధ పథకాల ద్వారా రూ.3,706.06 కోట్లు ఖర్చు చేసినట్లు పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంతి ఆర్కే రోజా తెలిపారు. నేతన్నలకు పెన్షన్ ద్వారా రూ.1,396.45 కోట్లు, నేతన్న నేస్తం ద్వారా రూ.969.77 కోట్లు, గత ప్రభుత్వం పెండింగులో ఉంచిన బకాయిలతో కలిపి ఆప్కోకు రూ.468.84కోట్లు, ఇతర పథకాల ద్వారా రూ.871 కోట్లు వ్యయం చేసినట్లు వివరించారు. మున్సిపాలిటీ 10వ వార్డు గోవిందపాళెం సచివాలయ పరిధిలోని చర్చి కాంపౌండ్, అంకాలమ్మ గుడి వీధుల్లో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి నిర్వ హించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి, నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు.

మరోసారి గెలిపించుకుందాం

అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నను గెలిపించుకుని, సీఎంగా చేసుకోవాలని చెప్పారు. ఊరు వాడా ఒక్కటై అభివృద్ధిని, సంక్షేమాన్ని మరింత సాధించుకోవాలని సూచించారు. గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని గుర్తుచేశారు. నేడు జగనన్న నాలుగున్నరేళ్లలోనే అద్భుతాలు చేశారని, ఇందుకు దేశ ప్రధాని ప్రశంసలే నిదర్శనమన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని వివరించారు. ఇలాంటి సీఎం మనకు రావడం రాష్ట్ర ప్రజలు చేసుకొన్న అదృష్టమని అభివర్ణించారు. స్థానికంగా గుర్తించిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్ మొదలియార్, కౌన్సిలర్లు కుప్పమ్మ, గుణ, ఏకాంబరం, మైనారిటీ డైరెక్టర్ మాహీన్, సింగిల్ విండో ప్రెసిడెంట్స్ శ్రీనివాసులు రెడ్డి, నారాయణరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్లు లారీ మోహన్, మనోహర్‌రెడ్డి, జయచంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు లత, ఉమామహేశ్వర్, తిరునావకర్సు, గోపి, జయబాబు, ఈశ్వరయ్యయాదవ్, చిరంజీవి, కుట్టి, చక్రి పాల్గొన్నారు.

ప్రజా సంకల్పంతో మహా సంక్షేమం

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కే నారాయణస్వామి

పాలసముద్రం : ప్రజా సంకల్ప పాదయాత్రతో మహా సంక్షేమం పుట్టుకువచ్చి నాలుగున్నరేళ్లు పూర్తి చేసుకుందని డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేసిన ప్రతి అడుగూ గడపగడపలో సంక్షేమాన్ని నింపుతోందని చెప్పారు. సంక్షేమాభివృద్ధితో పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతున్నాయన్నారు. సామాజిక సాధికార పాలన కొనసాగుతోందని కొనియాడారు. సంక్షేమ పథకాలతోపాటు రాష్ట్రంలో విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ రంగాల్లో పెను మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. పేదవాడి పిల్లలు ఆంగ్ల విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య రంగం రాష్ట్రంలో రోజు రోజుకూ కొత్తపుంతలు తొక్కుతోందన్నారు. ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ వంటి ఎన్నో సంక్షేమ పథకాల్ని అమలు చేయడం ద్వారా ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న జగనన్నను తిరిగి సీఎం చేసి సంక్షేమ పథకాలు అందుకోవాలని ఆయన కోరారు.

పది పరీక్షలపై వదంతులు నమ్మొద్దు

చిత్తూరు కలెక్టరేట్ : సామాజిక మాధ్యమాల్లో ఈ విద్యాసంవత్సరంలో పది పబ్లిక్ పరీక్షలు ఉండవని ప్రచారమవుతున్న వదంతులను నమ్మకూడదని డీఈవో విజయేంద్రరావు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో నిర్వహించే పది పబ్లిక్ పరీక్షలుండవు అంటూ ఓ సందేశం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోందన్నారు. ఆ మెసేజ్ వాస్తవం కాదని స్పష్టం చేశారు. ఎవరూ అలాంటి అసత్యాలను నమ్మకూడదని తెలిపారు. పబ్లిక్ పరీక్షలు ఖచ్చితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, పరీక్షలకు సన్నద్ధం చేయాలని డీఈవో ఆదేశించారు.

పకడ్బందీగా సురక్ష శిబిరాలు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. తాడేపల్లి నుంచి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణపై సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ మేరకు ఆరోగ్య శిబిరాలను నిర్వహించినట్లు వివరించారు. జిల్లాలోని 31 మండలాలు, 5 మునిసిపాలిటీల్లో రెండు వైద్య బృందాల చొప్పున 72 ఏర్పాటు చేశామన్నారు. 117 మంది మెడికల్ ఆఫీసర్లు, 162 మంది వైద్యనిపుణులు క్యాంపుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 488 క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా 6 క్యాంపులు నిర్వహించాల్సి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,38,932 మంది ఓపీలు పొందారని చెప్పారు. 2,378 మందిని నెట్‌వర్క్, టీచింగ్ ఆస్పత్రులకు రెఫర్ చేసినట్లు చెప్పారు. అర్బన్ ప్రాంతాల్లో 37,048 మంది ఓపీలు పొందగా, 309 మందిని రెఫర్ చేసినట్లు వెల్లడించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డీఐవో డాక్టర్ రవిరాజు, సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు రైతుల ఖాతాల్లోకి 'భరోసా'

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం జిల్లాస్థాయి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రెండవ విడత వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఏటా మూడు విడతల్లో అర్హులైన రైతులకు రూ.13,500 ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం నేరుగా ఖాతాల్లో జమచేస్తోందని గుర్తుచేశారు. ప్రతి ఏటా మొదటి విడత రూ.7,500, రెండో విడత రూ.4000, మూడో విడత రూ.2000 చొప్పున ప్రభుత్వం నగదు అందజేస్తోందని చెప్పారు. ప్రస్తుతం 5వ ఏడాది రెండో విడతగా రూ.4 వేలు నగదు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని వివరించారు. ఐదు సంవత్సరాల్లో జిల్లాలోని 2,31,144 మంది రైతులకు రూ.94.29 కోట్లను ప్రభుత్వం అందజేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రైతు భరోసా–పీఎం కిసాన్ పథకానికి ప్రభుత్వం రూ.1,391 కోట్లను రైతుల కోసం ఖర్చు చేసినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి కార్యక్రమానికి జిల్లాలోని మంత్రులు, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు వివరించారు.

వృద్ధురాలి కళ్లతో మరొకరికి చూపు


మృతి చెందిన లక్ష్మమ్మ

యాదమరి: తనువు చాలించిన వృద్ధురాలు మరొకరి కళ్లకు చూపునిచ్చింది. మండలంలోని మంగళపల్లెకు చెందిన లక్ష్మమ్మ(83) ఈ నెల 1న బీపీ ఎక్కువ కావడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవా రం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఆమె కళ్లను దానం చేస్తారా అని వైద్యులు అడగడంతో బంధువుల అంగీకరించారు. దీంతో వైద్యులు నేత్రాలను సేకరించి మృతదేహం కుటుంబ సభ్యులకు అందించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు చరణ్


చరణ్‌తో ఉపాధ్యాయుల బృందం

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు సోమవారం హెచ్ఎం మనోహర్ నాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిదో తరగతి విద్యార్థి చరణ్ గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. చరణ్‌ని గ్రామ పెద్దలతోపాటు ఉపాధ్యాయ బృందం అభినందించింది.

ప్రతి అర్జీకి న్యాయం చేయాలి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అర్జీదారులు

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనలో నమోదయ్యే ప్రతి అర్జీని ఆయా శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు స్పందనలో ఉన్నతాధికారులకు అర్జీలు అందజేశారు. జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. స్పందనలో అర్జీదారులు అందజేసే ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. స్పందనలో వివిధ శాఖలకు సంబంధించి 315 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. 126 కుటుంబాలు ఉన్న తమ గ్రామంలో మౌళిక సౌకర్యాలు కల్పించాలని ఐరాల మండలం తిరుమలయ్యగారిపల్లెకు చెందిన ఎస్సీ కాలనీవాసులు స్పందనలో అర్జీ అందజేశారు. ఉద్యోగ నియామకాల్లో యువతకు న్యాయం జరిగేలా ఉత్తర్వులను అమలు చేయాలని అంధుల సమాఖ్య జిల్లా సమన్వయ కర్త విజయశేఖర్‌రెడ్డి అర్జీ అందజేశారు. తిరుపతి జిల్లా కేంద్రంలోని అంధుల శరణాలయంలో సీట్ల భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రాజశేఖర్, డిప్యూటీ కలెక్టర్ భవాని, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

10 మంది ఓటర్లున్న గృహాల పరిశీలన

జిల్లా వ్యాప్తంగా ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఒకే డోర్ నెంబర్‌లో 10 మంది ఓటర్లున్న గృహాలను మరోసారి ప్రత్యేకంగా పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులతో, ఆర్డీవో, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఒకే గృహంలో 10 మంది ఓటర్లు ప్రస్తుతం ఉండే అవకాశాలు లేవన్నారు. ఒక వేళ ఎక్కడైనా 10 మంది ఓటర్లు ఒకే గృహంలో ఉన్నట్లయితే ఆ గృహానికి అదనపు డోర్ నెంబర్ ఇవ్వాలన్నారు. 100 సంవత్సరాలకు పైబడిన ఓటర్లను జాగ్రత్త గా పరిశీలించి జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారుజ. నెట్‌వర్క్ కనెక్టివిటీ లేని పోలింగ్ కేంద్రాలు ఎక్కడైనా ఉన్నట్లయితే వాటి వివరాలను పంపాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో రాజశేఖర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు మధుసూధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రబ్బానీబాషా పాల్గొన్నారు.

నవోదయకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికిగాను 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుకు చివరి గడువు 15 నవంబర్ 2023 వరకు ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ యస్. విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలియచేశారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2009 మే 1 నుంచి 2011 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1 నుంచి 2009 జూలై 31 మధ్యన జన్మించిన వారై ఉండాలని, పరీక్షా తేదీ 10 ఫిబ్రవరి 2024న ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

పిడుగుపాటుకు పాడిఆవు మృతి

శ్రీరంగరాజపురం : పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్న తయ్యూరు గ్రామంలో సోమవారం వెలుగుచూసింది. యాజమని ప్రభాకర్ కథనం మేరకు తన పొలంలో మేత మేస్తుండగా వర్షం రావడంతో చెట్టు కింద ఆవును కట్టేశారు. ఆ చెట్టు మీద పిడుగుపడి పాడిఆవు మృతి చెందింది. దీంతో తమకు రూ.60 వేలు నష్టం వచ్చినట్లు బాధితుడు వాపోయాడు.

మట్కా కేసులో ముగ్గురికి జైలు


ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీసులు

నగరి : మట్కా కేసులో ముగ్గురికి సోమ వారం నగరి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సీఐ సురేష్ తెలిపారు. ఇటీవల మున్సిపల్ పరిధిలో మట్కా జూదం ఆడుతుండగా ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా, పూర్వాపరాలను విచారించిన న్యాయమూర్తి నిందితులు టి.బాలాజి, పి.స్రుబమణ్యం, కె.పురుషోత్తంకు 20 రోజుల జైలు శిక్ష, రూ.300 చొప్పున జరిమానా విధించారు. కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్ వారిని సత్యవేడు సబ్‌జైలుకు తరలించారు.

బస్సు కిందపడి యువకుడి మృతి

చిత్తూర్ అర్బన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం నగరంలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ ఎస్ఐ బాబు కథనం మేరకు, గంగాధర నెల్లూరు మండలం , పాచిగుంటకు చెందిన పయని (26) చిత్తూరులోని ఓ ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిత్తూరు నుంచి మురకంబట్టుకు సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, సీతమ్స్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న ఉమేష్ తన స్నేహితుడు కార్తీక్‌తో కలిసి మరో ద్విచక్ర వాహనంపై వస్తూ కట్టమంచి వద్ద ఢీకొట్టాడు. దీంతో కింద పడిన పయని పైకి ఆర్టీసీ బస్సు ఎక్కేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఉమేష్, కార్తీక్ ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం వీరిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురు బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలకు హాజరుకాని ఐదుగురు బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 4, 5 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా 1,762 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు క్యాంపులు నిర్వహించారు. ఈ మేరకు తప్పకుండా హాజరుకావాలని ఉన్నతాధికారులు ముందస్తుగా బీఎల్‌వోలను ఆదేశించారు. అయినప్పటికీ చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదుగురు బీఎల్‌వోలు విధులకు హాజరుకాలేదు. దీంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసేందుకు కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపట్టారు.

విహారయాత్ర పేరుతో రూ.2 లక్షలు స్వాహా

గుడిపాల: విహారయాత్ర పేరుతో ఓ హెచ్ఎం రూ.2లక్షలు స్వాహా చేసిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, మండలంలోని నరహరిపేట హెచ్ఎం సబర్‌మతి 9, 10 వ తరగతి విద్యార్థులను తమిళనాడుకు విహారయాత్రకు తీసుకెళతామని పది నెలల క్రితం చెప్పారు. ఇందు కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.2వేలు వసూలు చేశారు. ఇలా 100 మంది కలిపి మొత్తం ఆమెకు రూ.2లక్షలు అందజేశారు. అయితే ఆమె ఆ సొమ్ము తీసుకుని స్వాహా చేసింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి నిలదీశారు. ఇంతలో ఆమెకు ఉద్యోగోన్నతి రావడంతో అక్కడి నుంచి బదిలీ అయ్యారు. విషయం తెలుసుకున్న పలువురు విద్యార్థులు పాఠశాల వద్దకు సోమవారం వచ్చారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌కు ఓ విద్యార్థి తండ్రి వినతిపత్రం అందజేశారు. ఆయన ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

బాలిక కిడ్నాప్.. లైంగిక దాడికి యత్నం


నిందితుడు బావాజీ

రొంపిచెర్ల : బంగారు నగలు తీసి ఇస్తానని మాయమాటలు చెప్పి ఓ బాలికను కిడ్నాప్ చేసి తన కోర్కె తీర్చాలని వేధించిన కామాంధుడి నుంచి బాలిక తప్పించుకుని ఇంటికి చేరింది. ఎస్ఐ కృష్ణయ్య కథనం.. రొంపిచెర్ల గ్రామ పంచాయతీకి చెందిన బాలిక స్థానికంగా ఒక ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. ఆ బాలిక ఉంటున్న ప్రాంతానికి చెందిన మెకానిక్ బావాజీ(30) రెండు నెలలుగా బాలికకు బంగారు నగలు తీసి ఇస్తానని మాయమాటలు చెబుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల1వ తేదీ రాత్రి 8 గంటలకు బాలికను కిడ్నాప్ చేసి మదనపల్లె, పాకాల, విజయవాడ, నాయుడుపేటకు తీసుకెళ్లాడు. బాలిక అదృశ్యంపై ఆమె తల్లిదండ్రులు రొంపిచెర్ల పోలీసులకు ఈనెల 2వ తేదీ ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇలా ఉండగా బాలికను తీసుకుని వెళ్లిన అతడు తన కోర్కె తీర్చాలంటూ వేధించసాగాడు. నాయుడుపేటలోని ఒక హోటల్లో ఆదివారం ఉదయం టిఫిన్ తినేందుకు బావాజీ ఆ బాలికను తీసుకెళ్లాడు. ఆమె అక్కడి నుంచి తప్పించుకుని బయటపడింది. ఇంటికి చేరుకుని జరిగిన ఉదంతాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. నిందితుడు బాలికకు వరుసకు చిన్నాన్న అని తెలిసింది. బావాజీకి భార్య, ఒక కుమారుడు(2) ఉన్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం అన్నమయ్య జిల్లా పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల నివేదిక ఆధారంగా కేసు మార్పు చేస్తామని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. నిందితుడు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు రొంపిచెర్ల క్రాస్‌లో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేసి అతడిని కోర్టుకు హాజరు పరిచారు. న్యాయమూర్తి నిందితుడికి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారు.

30 ఏళ్ల సమస్యకు పరిష్కారం


మంత్రి రోజాను సన్మానిస్తున్న మిద్దిగుంట ఏఏడబ్ల్యూ గ్రామస్తులు

పుత్తూరు రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా 30 ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించారు. ఇటీవల పుత్తూరు రూరల్ మండలం ఎగవ కనకంపాళెం పంచాయతీ మిద్దిగుంట ఏఏడబ్ల్యూలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఏడబ్ల్యూకు గత మూడు దశాబ్దాలుగా విద్యుత్ సౌకర్యం లేదని గ్రామస్తులు మంత్రి రోజా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి గ్రామంలో లైట్లు వెలగాలంటూ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామానికి 6 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, దీపాలు అమర్చారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన ఏర్పాట్లు చేశారు. అడిగిన తక్షణం తమ సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు సోమవారం నగరిలోని మంత్రి రోజా నివాసానికి వెళ్లి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. తొరూరు అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీటి సమస్య ఉందన్న విషయం మంత్రి రోజా దృష్టికి రావడంతో, సోమవారం తాగునీటి కొళాయిని ఏర్పాటు చేశారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా


మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రాజేంద్ర

వరదయ్యపాళెం: మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రాజేంద్ర తెలిపారు. శ్రీసిటీ పారిశ్రామికవాడలో సోమవారం తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లావ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా మార్గాలను గుర్తించాలని సూచించారు. పోలీస్ సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం సంబంధిత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎలాంటి చట్టపరమైన శిక్షలకు గురవుతారో గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నాటు సారా తయారీని పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. పాత నేరస్తులపై గట్టి నిఘా పెట్టాలన్నారు. జిల్లాను గంజాయి రహిత జోన్‌గా మార్చడానికి సెబ్, స్థానిక పోలీసులు సమష్టిగా పనిచేయాలని కోరారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్న శ్రీసిటీని డ్రగ్స్ రహిత ప్రశాంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో తిరుపతి అర్బన్, రూరల్, తిరుమల, చంద్రగిరి రూరల్, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాగలాపురం, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, వాకాడు సెబ్ సీఐలు, ఎస్ఐలు, జిల్లా టాస్క్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన విజేతలకు బహుమతులు



ఎస్పీ నుంచి నగదు అందుకుంటున్న విద్యార్థి రోహిత్, కానిస్టేబుల్ హరీష్

చిత్తూరు అర్బన్: పోలీసు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో చిత్తూరు పోలీసు శాఖ నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందచేశారు. చిత్తూరు నగరంలోని పోలీసు అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు ఎస్పీ రిషాంత్‌రెడ్డి నగదు రివార్డులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో ఐరాల మండలం ఎం.పైపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సి.రోహిత్ మొదటి బహుమతి కింద రూ.5 వేలు రివార్డును ఎస్పీ చేతుల మీదుగా అందుకున్నాడు. వి.వెన్నెల, హరిప్రియ రెండు, మూడు బహుమతులు అందుకున్నారు. పోలీసులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సదుం స్టేషన్ కానిస్టేబుల్ ఎ.రాంబాబు, చిత్తూరు ట్రాఫిక్ కానిస్టేబుల్ కె.హరీష్, వక్తృత్వ పోటీల్లో అమృతకుమారి (డీఏఆర్, చిత్తూరు), కె.బాపూజి (డీసీఆర్‌బీ, చిత్తూరు), కె.హరీష్ (ట్రాఫిక్, చిత్తూరు) ఎస్పీ నుంచి నగదు రివార్డులు అందకున్నారు.

టీడీపీ నేతల మధ్య ఫోన్ సంభాషణ వైరల్

చిత్తూరు అర్బన్: ఒకే కుటుంబంలోని అన్నదమ్ముల మధ్య చిచ్చు పెడుతూ టీడీపీ నేతలు పబ్బం గడుపుకుంటున్నారు. దీనికి సంబంధించిన ఫోన్ సంభాషణ సామాజిక మాధ్యమాల్లో సోమవారం వైరల్ అయ్యింది. తారకరామ్, రైల్వే బాబురెడ్డి అనే ఇద్దరు టీడీపీ నేతల మధ్య జరిగిన సంభాషణ బయటకు రావడంతో ఆ పార్టీ నేతలు ఖంగుతిన్నారు. చిత్తూరు నగరంలోని కట్టమంచికి చెందిన తారక్‌రామ్, అతని అన్న హరిప్రసాద్ ఇద్దరూ టీడీపీలో ఉన్నారు. అయితే కాజూరు బాలాజీతో తిరుగుతున్నాడని తారకరామ్‌ను కట్టమంచి టీడీపీ ఇన్‌చార్జ్ నుంచి తప్పించి, హరిప్రసాద్‌కు కట్టబెట్టడానికి పార్టీలోని కురువృద్ధుడు ప్రయత్నిస్తున్నట్లు ఈ ఆడియోలో ఉంది. మునిసిపల్ ఎన్నికల్లో నీకే కార్పొరేటర్ సీటు ఇస్తామంటూ హరిప్రసాద్‌కు ఆశ చూపించడం, అన్నదమ్ముల మధ్య గొడవ వస్తే ఏం చేయాలి..? అని ప్రశ్నిస్తే అన్నీ త్యాగ చూసుకుంటాడని సమాధానమిచ్చినట్లు ఇందులో ఉంది. అయితే హరిప్రసాద్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాల్సిన బాబురెడ్డి, పొరపాటున అతని తమ్ముడు తారక్‌రామ్‌కు ఫోన్ చేశాడు. హరిప్రసాద్‌తో మాట్లాడుతున్నట్లు భావించి తారక్‌రామ్‌తో మాట్లాడగా, ఈ మొత్తం ఆడియోను రికార్డుచేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టేశారు.

నేడు వైఎస్సార్ రైతు భరోసా

పుత్తూరు రూరల్: వైఎస్సార్ రైతు భరోసా–2023 ఏడాదిలో రెండవ విడత నగదు పంపిణీ కార్యక్రమానికి సంబంధించి మంగళవారం ఉదయం వడమాలపేటలోని ఎస్ఆర్‌టీ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇసుక తరలింపునకు బ్రేక్

- అడ్డుకున్న గ్రామస్తులు, నాయకులు
- అక్రమార్కులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గంగాధర నెల్లూరు: ఇసుక తరలిస్తున్న అక్రమార్కులను స్థానికులు అడ్డుకుని, పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, మండల పరిధిలోని కొట్రకోన పంచాయతీ గారంపల్లె వద్ద నీవా నదిలో కొంతమంది అక్రమార్కులు భారీ వాహనాలతో ఇసుక తరలింపు చేపట్టారు. ప్రస్తుతం ఇసుక తరలింపునకు అనుమతుల్లేనప్పటికీ అక్రమార్కులు గతంలో ఇసుక తరలిస్తున్న రీచ్‌కు సంబంధించిన నకిలీ బిల్లులతో ఇసుక అక్రమ అమ్మకాలు ప్రారంభించారు. సమాచారం అందుకున్న స్థానిక సర్పంచ్ భర్త విజయ్ శేఖర్, ఉప సర్పంచ్ కుమార్, ఎంపటీసీ భర్త సుధాకర్ రెడ్డి రీచ్ వద్దకు ప్రజలతో కలిసి చేరుకున్నారు. ఇసుక తరలింపు సంబంధించిన అనుమతులు చూపాలని వారిని కోరారు. దీంతో అక్రమదారులు సమాధానమివ్వలేక నీళ్లునమిలారు. వెంటనే సమాచారాన్ని గంగాధర నెల్లూరు ఎస్ఐకి తెలియజేశారు. ఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో కలిసి రీచ్ వద్దకు చేరుకుని, వారి వద్ద ఉన్న నకిలీ బిల్లులను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇసుక తరలిస్తున్న రెండు ప్రొక్లెయినర్లను ఒక మోటార్ సైకిల్, ఒక కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామస్తులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల ఫిర్యాదు మేరకు, కేసు దర్యాప్తు చేస్తామని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడు జ్ఞానేందర్ రెడ్డి అలియాస్ కలిజవేడు కిరణ్ రెడ్డి పరారీలో ఉన్నట్లు వారు వివరించారు.



గ్రామస్తులు అడ్డుకోవడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయిన ఇసుక ట్రాక్టర్లు